క్లుప్తంగా

ఏఎంసీ డైరెక్టర్‌కు సన్మానం



శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న ముదిరాజ్ సంఘం ప్రతినిధులు

యాలాల: తాండూరు ఏఎంసీ డైరెక్టర్‌గా ఎన్నికైన యాలాల వాసి గోనేగారి శ్రీనివాస్ ముదిరాజ్‌ను మండల ముదిరాజ్ సంఘం ప్రతినిధులు సోమవారం ఘనంగా సన్మానించారు. మార్కెట్ కమిటీ డైరెక్టర్‌గా శ్రీనివాస్‌ను నియమించడంపై ఆ సంఘం ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు. రైతుల తరఫున శ్రీనివాస్ ముందుండి లాభదాయక నిర్ణయాలకు మద్దతు పలకాలని ఆకాంక్షించారు. ఏఎంసీ డైరెక్టర్‌గా ముదిరాజ్ బిడ్డకు అవకాశం ఇవ్వడంపై ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. అలాగే, తాండూరు ఏఎంసీ వైస్ చైర్మన్ నర్సిరెడ్డిని బెన్నూరు మాజీ సర్పంచ్ మల్లికార్జున్‌రెడ్డి ఘనంగా సన్మానించారు. నర్సిరెడ్డిని వైస్‌చైర్మన్‌గా నియమించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. సన్మానం చేసినవారిలో అంబదాస్, శరణుభూపాల్, అనంతయ్య తదితరులు ఉన్నారు.

ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైనది

జెడ్పీటీసీ మాజీ సభ్యురాలు మంజుల



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న నాయకులు

తాండూరు రూరల్: ఉపాధ్యాయవృత్తి ఎంతో పవిత్రమైందని మాజీ జెడ్పీటీసీ గాడి మంజుల అన్నారు. సోమవారం మండల పరిధిలోని చెంగోల్ జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాల్లో పని చేసి బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులను సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బాలబాలికలను భావిపౌరులుగా తీర్చిదిద్దే బృహత్తర బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. చెంగోల్ పాఠశాల్లో దాదాపు 12 సంవత్సరాలు పని చేసిన సావిత్రి ,శిరీష, సమ్మప్ప, రాధ, మల్లిఖార్జునస్వామి, శ్రీధర్, వెంకటప్పలను శాలువ, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. అనంతరం నూతన ఉపాధ్యాయులను కూడా సన్మానించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం నర్సానాయక్, మాజీ ఎంపీటీసీలు వెంకటేశం, రత్నమాల గ్రామస్తులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించండి



స్పీకర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ప్రతినిధులు

అనంతగిరి: తమ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం వెంటనే తగు చర్యలు తీసుకోవాలని వికారాబాద్ జిల్లా అంగన్‌వాడీ, హెల్పర్స్ యూనియన్ ప్రతినిధులు కోరారు. ఈ మేరకు సోమవారం వికారాబాద్‌లో స్పీకర్ ప్రసాద్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్ అంగన్‌వాడీ టీచర్లకు రూ. 2లక్షలు, హెల్పర్లకు రూ.లక్ష ఇవ్వాలన్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా నాయకురాలు నర్సమ్మ, భారతి, మనోహర, లక్ష్మి, విజయలక్ష్మి, సంతోష, సునీత, అండాలు తదితరులు పాల్గొన్నారు.

పనులు పూర్తి చేయించండి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

తాండూరు టౌన్ : పట్టణంలోని యశోదనగర్‌లో ఉన్న దొడ్డి కొమురయ్య విగ్రహం వద్ద అసంపూర్తి ఉన్న పనులను పూర్తి చేయించాలని కురుమ సంఘం నాయకులు సోమవారం చైర్‌పర్సన్ స్వప్నకు వినతిపత్రం అందజేశారు. ఐరన్ గ్రిల్, టైల్స్‌తో పాటు పలు పనులు పూర్తి అయ్యేలా చొరవ తీసుకోవాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో కురుమ సంఘం నాయకులు జగదీష్, మల్లేశం, పూజారి పాండు, వెంకటయ్య, హన్మయ్య, మహేష్ నర్సింలు తదితరులు ఉన్నారు.

అందుబాటులో చొప్పజొన్న విత్తనాలు

దౌల్తాబాద్: మండల కేంద్రంలోని పశువైద్య కార్యాలయంలో సబ్సిడీపై చొప్పజొన్న విత్తనాలు అందుబాటులో ఉన్నట్లు పశువైద్యాధికారి హథిరాం పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ రైతులు ఆధార్‌కార్డు, పట్టాపాస్ బుక్ తీసుకువచ్చి విత్తనాలు తీసుకెళ్లాలని చెప్పారు. మండలానికి 3క్వింటాళ్ల 50కిలోలు విత్తనాలు వచ్చాయని తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

‘ఉపాధి’లో పండ్ల తోటలు

జిల్లాలోని అన్ని మండలాల్లో చిన్న, సన్నకారు రైతుల ఆర్థిక అభివృద్ధే లక్ష్యంగా జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం ఆధ్వర్యంలో పండ్ల తోటలను పెంచేందుకు నిర్ణయించింది. 17 రకాల పండ్లతోటల పెంపకానికి అవకాశం కల్పించింది.

- మండలంలో 50ఎకరాల లక్ష్యం
- 17 రకాల పండ్లతోటల పెంపకానికి అవకాశం



మామిడితోట

దౌల్తాబాద్: పండ్లతోటల పెంపకానికి కేంద్ర ప్రభుత్వం ప్రోత్సాహాన్ని అందిస్తోంది. మండల వ్యాప్తంగా 50 ఎకరాల్లో తోటల పెంపకమే లక్ష్యంగా అధికారులు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. జిల్లాలో ప్రతి మండలంలో 50 ఎకరాల్లో పండ్ల తోటలు సాగు చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశాలు ఉన్నాయి. గ్రామీణాభివృద్ధిశాఖ ఆధ్వర్యంలో 17 రకాల పండ్ల తోటల పెంపకానికి అవకాశం కల్పించింది.

విస్తృత ప్రచారం..

పండ్లతోటల లక్ష్యాన్ని చేరుకునేందుకు ఉద్యానశాఖ అధికారులతో పాటు ఉపాధిహామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్లు, వ్యవసాయశాఖ అధికారులకు బాధ్యతలు అప్పగించారు. జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఇప్పటికే ప్రచారం నిర్వహించారు. పండ్లతోటలు సాగు చేసే రైతులకు ఐదెకరాల్లోపు వ్యవసాయ భూమి ఉండి, చిన్న, సన్నకారు రైతులను ఎంపిక చేయాలన్నా నిబంధనలు ఉండడంతో అధికారులుకు సాగు లక్ష్యం కష్టంగా మారింది. అంతేకాకుండా లబ్ధిదారులకు ఉపాధిహామీ జాబ్‌కార్డు తప్పనిసరిగా ఉండాలన్న లక్ష్యంతో ఈ పథకం అమలుకు కేంద్రం శ్రీకారం చుట్టింది. పండ్ల తోటల సాగు చేసే రైతులకు ప్రభుత్వమే అన్ని సదుపాయలు కల్పించడంతో పాటు, నిబంధనలు పక్కాగా అమలు చేస్తుందని అధికారులు చెబుతున్నారు. మొక్కల కొనుగోలు నుంచి గుంతలు తీయించడం, ప్లాంటేషన్, ఎరువుల నిర్వహణ కూలీల ఖర్చులు ప్రభుత్వమే భరిస్తుంది. తొలుత లబ్ధిదారులు ఖర్చు చేస్తే తర్వాత ప్రభుత్వమే రైతుల ఖాతాల్లో జమ చేస్తుంది.

దరఖాస్తు చేసుకోవాలి

పండ్లతోటల పెంపకానికి ముందుకొచ్చే రైతులు స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఉపాధి సిబ్బందికి దరఖాస్తు అందజేయాలి. ఐదెకరాలలోపు వ్యవసాయ భూమి, ఉపాధిహామీ జాబ్‌కార్డు, ఏఏ పండ్లతోటలు సాగు చేస్తారో దరఖాస్తులో నమోదు చేయాలి.

– రజనీకాంత్, ఏపీఓ, దౌల్తాబాద్

రవాణాశాఖ నిబంధనలు తప్పనిసరి

ఎంవీఐ రవీంద్రనాయక్



డ్రైవర్లతో మాట్లాడుతున్న పరిగి ఎంవీఐ

పరిగి: వాహన యాజమానులు, డ్రైవర్లు తప్పనిసరిగా రవాణాశాఖ నిబంధనలను పాటించాలని పరిగి ఎంవీఐ రవీంద్రనాయక్ సూచించారు. సోమవారం పట్టణ కేంద్రంలోని ప్రైవేటు పాఠశాలల బస్సు డ్రైవర్లకు, యాజమానులకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. స్కూల్ బస్సుల్లో కచ్చితంగా ఫస్ట్ ఎయిడ్ బాక్స్, ఫైర్‌కిట్, ఎమర్జెన్సీ ద్వారం పలు సామన్లు ఉండాలన్నారు. నిబంధనలను పాటించని వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతి వాహనానికి ఫిట్నెస్, ఆర్‌సీ, పీయూసీలతో పాటు డ్రైవింగ్ లైసెన్స్ ఉండాలని, వాటిని బస్సులోనే ఉంచుకోవాలన్నారు. ఫిట్‌నెస్ తదితర ధ్రువపత్రాలు లేని వారు త్వరలోనే తీసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో పరిగి ఏఎంవీఐ కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

సివిల్ సప్లయ్ గోదాం ఏర్పాటు చేయండి



మురళీధర్‌కు వినతిపత్రాన్ని అందిస్తున్న నాయకులు, హమాలీలు తదితరులు

కుల్కచర్ల: కుల్కచర్లలో సివిల్ సప్లయ్ గోదాంను ఏర్పాటు చేసి కార్మికులకు ఉపాధి కల్పించాలని డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి కోరారు. సోమవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో కూలీలు, కార్మికులతో కలిసి తహసీల్దార్ మురళీధర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎంతో మంది కూలీలకు ఉపాధిగా నిలిచే సివిల్ సప్లయ్ గోదాంను కుల్కచర్లలో ఏర్పాటు చేయాలని, తద్వారా రేషన్‌షాపులకు త్వరితగతిన బియ్యాన్ని పంపిణీ చేయడంతో పాటు, స్థానికంగా ఉండే కూలీలకు ఉపాధి లభిస్తుందని పేర్కొన్నారు. గత 25సంవత్సరాల క్రితం కుల్కచర్లలో సివిల్ సప్లయ్ గోదాం ఉండేదని, తర్వాత పరిగికి మార్చారని అన్నారు. ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా కుల్కచర్లలో సివిల్ సప్లయ్ గోదాంను ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ ఆనందం, స్థానిక కార్మిక సంఘ సభ్యులు పాల్గొన్నారు.

అధికారులపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తా

తాండూరు ఆర్డీఓ శ్రీనివాసరావు



తాండూరు: ప్రజావాణిలో అర్జీ స్వీకరిస్తున్న ఆర్డీఓ శ్రీనివాసరావు

తాండూరు: ప్రజావాణికి హాజరుకాని తాండూరు డివిజన్, సర్కిల్ అధికారులపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తానని ఆర్డీఓ శ్రీనివాసరావు మండిపడ్డారు. సోమవారం ఆర్డీఓ కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. సంబంధిత శాఖ అధికారులు హాజరు కాకుండా ఆయాశాఖల అధికారులు జూనియర్ అసిస్టెంట్ స్థాయి సిబ్బందిని పంపించారు. దీంతో సిబ్బందిపై ఆర్డీఓ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇన్నాళ్లు ప్రజా సమస్యలు వినే అవకాశం వచ్చిందన్నారు. ఇలాంటి కార్యక్రమాలకు అధికారులు రాకుండా సిబ్బందిని పంపడం సరికాదన్నారు. ఈ విషయమై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తానన్నారు. ప్రజావాణికి మొత్తం 4 అర్జీలు రాగా అందులో మండల పరిషత్ 3 అర్జీలు, 1 రెవెన్యూ పరమైన అర్జీ వచ్చిందని చెప్పారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత



సూచనలిస్తున్న సబ్ యూనిట్ అధికారి పకీరప్ప

కొడంగల్ రూరల్ : వర్షాకాలం దృష్ట్యా ప్రతి ఒక్కరూ పరిశుభ్రత పాటించాలని అంగడిరాయిచూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర సబ్ యూనిట్ అధికారి ఎస్.పకిరప్ప పేర్కొన్నారు. సోమవారం పట్టణ శివారులోని మహాత్మా జ్యోతిబాపూలే బీసీ గురుకుల పాఠశాలలో విద్యార్థులకు సీజనల్ వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. గురుకుల పరిసర ప్రాంతాల్లో, నీటి గుంతల్లో మందును పిచికారీ చేయించారు. మురికి నీటిలో దోమలు పెరిగేందుకు అవకాశం ఉంటుందని, మురుగునీరు నిల్వలేకుండా చూసుకోవాలని సూచించారు. సీజనల్ వ్యాధులు డెంగీ, మలేరియా, మెదడు వాపు, చికెన్‌గున్యా, టైఫాయిడ్, నీళ్ల విరేచనాలు తదితర వ్యాధులు రాకుండా పరిసరాల పరిశుభ్రతతో పాటు, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని వివరించారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ మధుసూదన్‌రెడ్డి, ఆశ కార్యకర్తలు మంజుల, రేణుక, పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

చికెన్ సెంటర్లకు నోటీసులు



నోటీసులు అందజేస్తున్న కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి

కుల్కచర్ల: అపరిశుభ్రంగా ఉన్న చికెన్ సెంటర్లను మూసేస్తామని కుల్కచర్ల గ్రామ పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని అపరిశుభ్రంగా ఉన్న చికెన్ సెంటర్లకు నోటీసులు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చికెన్ సెంటర్ల నిర్వహణ పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలని, దుర్వాసన వస్తూ అనారోగ్య పరిస్థితులు తీసుకువచ్చేలా ఉంటే వాటిని సీజ్ చేస్తామని హెచ్చరించారు. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని చికెన్ సెంటర్ల నిర్వాహకులు దుకాణాలు కొనసాగించాలని సూచించారు. కార్యక్రమంలో స్థానిక గ్రామ పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేడు వీడియో కాన్ఫరెన్స్

బొంరాస్‌పేట : వానకాలంలో వ్యవసాయ సలహాలపై మంగళవారం మండల కేంద్రంలోని రైతువేదికలో ఉ.9.30గంటలకు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించనున్నట్లు మండల వ్యవసాయాధికారి అనురాధ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. స్వల్పకాలిక వరి వంగడాల సాగు, ప్రస్తుత పంటల్లో కలుపు యాజమాన్యంపై వ్యవసాయ శాస్త్రవేత్తల బృందంతో చర్చాగోష్ఠి ఉంటుందన్నారు. రైతులు వినియోగించుకోవాలని కోరారు.

ఫైర్ డ్రైవర్ ఆపరేటర్లకు శిక్షణ ఇవ్వండి

తాండూరు టౌన్ : పోలీసుశాఖలో ఫైర్ డ్రైవర్ ఆపరేటర్ ఉద్యోగానికి ఎంపికైన వారికి వెంటనే శిక్షణ ఇప్పించి, ఉద్యోగాల్లోకి తీసుకోవాలని కోరుతూ పలువురు అభ్యర్థులు సోమవారం డీజీపీ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. తెలంగాణ విపత్తు సంస్థలో ఉద్యోగాల ఎంపికై ఆరునెలలు గడుస్తున్నా, ఇంతవరకు శిక్షణకు పిలవలేదని వాపోయారు. ఉద్యోగం సాధించి విధులకు హాజరు కాకపోవడంతో మా కుటుంబాలు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నామన్నారు. వెంటనే ఉన్నతాధికారులు స్పందించి మమ్మల్ని ఉద్యోగాల్లోకి తీసుకోవాలని కోరారు.

చట్టపరమైన చర్యలు తీసుకోవాలి

కొడంగల్ రూరల్: వక్ఫ్‌బోర్డు భూములను ఎవరైనా కొనుగోలు చేసినా, విక్రయించినా వారిపై రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకోవాలని మాజీ ఉప సర్పంచు ఎస్‌ఎం.గౌసన్ సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఇటీవల రెవెన్యూ అధికారులకు సైతం ఫిర్యాదు అందించినట్లు తెలిపారు. కోట్ల రూపాయల విలువ చేసే భూములను కొందరు కబ్జా చేసి విక్రయాలకు పాల్పడుతున్నారని పేర్కొన్నారు.

పేదలకు అండగా ప్రభుత్వం

ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి



చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

దోమ : కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకు ఎల్లప్పుడూ అండగా నిలుస్తుందని ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఆయా గ్రామాల లబ్ధిదారులు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి అణగారిన వర్గాల అభ్యున్నతికి, పేదల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని పని చేస్తున్నారని అన్నారు. ప్రతి పేదవాడికి పథకాలు అందేలా కృషి చేస్తున్నామన్నారు.

పూడూరులో..

అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ పథకాలను అందిస్తున్నామని పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలో కళ్యాణ లక్ష్మి, షాదీముబార్ లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ చెక్కులను అందజేశారు.

ప్రజా సంక్షేమమే లక్ష్యం

పరిగి: ప్రజా సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం నిరంతరం పనిచేస్తుందని ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి అన్నారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు.

రైతు బాంధవుడు వైఎస్సార్



పరిగి: నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

పరిగి: దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి రైతు బాంధవుడని ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు యాదయ్య పేర్కొన్నారు. సోమవారం వైఎస్సార్ 75వ జయంతి సందర్భంగా కాంగ్రెస్ పార్టీ, వైఎస్‌ఆర్‌సీపీ, ప్ర జాసంఘాల ఆధ్వర్యంలో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వా రు మాట్లాడుతూ.. వైఎస్సార్ హయాంలో రైతుల కోసం ఉచిత విద్యుత్, ఒకే దఫా రైతు రుణమాఫీ, రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకాలు ఇలా ఎన్నో పథకాలను వైఎస్సార్ పేదల కోసం అమలు చేసి ప్రజల గుండెల్లో చిరస్మరణీయంగా నిలిచారన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు కృష్ణ, మండల అధ్యక్షుడు పరశురాంరెడ్డి ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

సంక్షేమ ప్రదాతకు ఘన నివాళి

తాండూరు: అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలను అందించిన ఘనత దివంగత వైఎస్సార్‌కే దక్కిందని మున్సిపల్ చైర్‌పర్సన్ తాటికొండ స్వప్న అన్నారు. సోమవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మహానేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి 75వ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా స్వప్న పరిమళ్, కాంగ్రెస్ నాయకులు ఇందిరమ్మ కాలనీలోని వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. చైర్‌పర్సన్ మాట్లాడుతూ..వైఎస్సార్ హయాంలో ప్రవేశపెట్టిన పథకాలే ఇప్పటికీ కొనసాగుతున్నాయన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ వెంకన్నగౌడ్, మాజీ కౌన్సిలర్ బస్వరాజ్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు హబీబ్‌లాల, నాయకులు ఉన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ

దౌల్తాబాద్: మండల కేంద్రంలో సోమవారం పోలీసులు సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఎస్‌ఐ రవిగౌడ్ మాట్లాడుతూ..గ్రామాల్లో ఎవరైనా అనుమానితులు కన్పిస్తే తమకు సమాచారం అందించాలని కోరారు. సైబర్ నేరాలపై ప్ర జలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రతి గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐ ముత్తురాజు, హెడ్‌కానిస్టేబుల్ దాసు తదితరులున్నారు.

ప్రజావాణికి దరఖాస్తుల వెల్లువ



తాండూరు రూరల్: దరఖాస్తులు స్వీకరిస్తున్న తహసీల్దార్

యాలాల: మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి 16 దరఖాస్తులు వచ్చాయి. వీటిలో 14 జీరో బిల్లులు నమోదు, 1 కరెంటు మీటరు, 1 విద్యుత్ స్తంభంఏర్పాటు చేయాలని కోరుతూ దరఖాస్తులు ఇచ్చినట్లు మండల పరిషత్ సూపరింటెండెంట్ శ్రీనివాస్ తెలిపారు. జీరో బిల్లు దరఖాస్తులు ఎక్కువగా వస్తున్నట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ మునిరొద్దీన్, ఎంపీడీఓ పుష్పలీల, ఎంపీఓ యాదయ్య, ఏఓ యాదగిరి పాల్గొన్నారు.

ప్రజావాణికి రెండు దరఖాస్తులు

మోమిన్‌పేట: ప్రజావాణికి రెండు దరఖాస్తులు వచ్చాయని ఇన్‌చార్జి ఎంపీడీఓ యాదగిరి పేర్కొన్నారు. ఒకటి ఏన్కతల గ్రామానికి చెందిన శివలక్ష్మి వితంతువు పింఛన్ కోసం, రెండవది మోమిన్‌పేటకు చెందిన ఉదయ్‌భాస్కర్ రెవెన్యూ సమస్యను పరిష్కరించాలంటూ ఫిర్యాదులు వచ్చాయన్నారు. కార్యక్రమంలో పశువైద్యాధికారి గీత, ఏఈ పీఆర్ ప్రణీత్‌కుమార్, ఏపీఓశంకర్, రాజు ఉన్నారు.

అధికారులు హాజరుకావాలి

తాండూరు రూరల్: ప్రజావాణి కార్యక్రమానికి అన్నీ శాఖల అధికారులు తప్పక హాజరుకావాలని తహసీల్దార్ తారాసింగ్ అన్నారు. సోమవారం ఎంపీడీఓ కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. ఆయా గ్రామాల్లోని ప్రజలు తమ సమస్యలను ప్రజావాణిలో ఫిర్యాదు చేయవచ్చాని సూచించారు. దరఖాస్తులు స్వీకరించి క్షేత్రస్థాయిలో పరిశీలించి సమస్యలను పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ విశ్వప్రసాద్, వైద్యాధికారి నిజానంద్, సీనియర్ అసిస్టెంట్ సత్యానారాయణతో పాటు పలుశాఖల అధికారులు పాల్గొన్నారు.

34 దరఖాస్తులు

కుల్కచర్ల: ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యతనిస్తామని ఎంపీడీఓ రామకృష్ణ అన్నారు. ప్రజావాణి కార్యక్రమంలో 34మంది నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు ప్రజావాణి నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ మురళీధర్, ఏపీఎం శోభ, ఎంఈఓ హబీబ్ అహ్మద్, అధికారులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ **తాగునీటిని సక్రమంగా సరఫరా చేయండి**



మాట్లాడుతున్న గ్రామస్తులు

మోమిన్‌పేట: మిషన్ భగీరథ నీటిని సక్రమంగా సరఫరా చేయాలని గ్రామస్తులు ప్రత్యేకాధికారి గీతను కోరారు. సోమవారం మండల పరిధిలోని ఎన్కేపల్లి గ్రామంలో పంచాయతీ ప్రత్యేకాధికారి గత అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ.. మిషన్ భగీరథనీటిని ప్రతి ఇంటికి వచ్చేలా సరఫరా చేయాలన్నారు. భగీరథనీరు రానప్పుడు బోరుబావి నుంచి సరఫరా చేసేలా చర్యలు తీసుకోవాలని చూచించారు. అలాగే, ఎస్సీవాడలో అండర్ డ్రైనేజీ నిర్మాణంలో ఉన్న మురుగు కాల్వను తవ్వి వదిలేశారని పనులు వెంటనే చేపట్టాలన్నారు. వీధిదీపాలు, మురుగు కాల్వలు శుభ్రంగా ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో కార్యదర్శి తిరుపతమ్మ, కారోబార్ విఠల్‌రెడ్డి, ఫీల్డ్ అసిస్టెంట్ అడివిరెడ్డి, నాయకులు సురేందర్, మైపాల్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

◆ **అసత్య ఆరోపణలు సరికాదు**

పూడూరు: కాంగ్రెస్ నాయకులు భూకబ్జాలు చేస్తున్నారని బీజేపీ నాయకులు మాట్లాడటం తగదని కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు కద్మూరు ఆనందం అన్నారు. ఎన్కేపల్లిలో భూములు లాక్కున్నారని అనడం సరికాదన్నారు. ఎన్కేపల్లి కాంగ్రెస్ నాయకులపై బురదజల్లే ప్రయత్నం చేస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. అభివృద్ధిని జీర్ణించుకోలేక ఆరోపణలు చేస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మెన్ సతీష్‌రెడ్డి, జిల్లా కార్యదర్శులు రఘునాథ్‌రెడ్డి, శకీల్, శ్రీనివాస్, మండల నాయకులు ఉన్నారు.

◆ **మొహర్రం ప్రారంభం**

కొడంగల్ : మొహర్రం (పీర్ల పండుగ) ప్రారంభమైంది. హిందూ ముస్లింల మత సామరస్యానికి ప్రతీకగా మొహర్రం నిలుస్తోంది. ఈనెల 17వ తేదీ వరకు ప్రతిరోజు పీర్ల చావిడిలో పండుగ జరుగుతుంది. ఉమ్మడి పాలమూరు జిల్లాలో పీర్ల పండుగకు ప్రత్యేకత ఉంది. 9 రోజుల పాటు వేడుకలు జరుగుతాయి.

◆ **ప్రజాపాలన సేవా కేంద్రంతో లబ్ధి**

వికారాబాద్: మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రజాపాలన సేవా కేంద్రాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ రాములు అన్నారు. సోమవారం ఆయన ప్రజాపాలన సేవా కేంద్రంలో ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించి మాట్లాడారు. ప్రజాపాలనలో 6 గ్యారంటీలకు సంబంధించి దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులు గృహజ్యోతి, సబ్సిడీ గ్యాస్ పథకాలు అందకపోతే ప్రజాపాలన సేవా కేంద్రాన్ని సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీఓ విజయ్‌కుమార్, సూపరింటెండెంట్ షిండే, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వేణుమాధవ్, జేఏ షఫీ, సీఓ శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

◆ **మండల ప్రత్యేకాధికారిగా జ్ఞానేశ్వర్**

కొడంగల్ : కొడంగల్ మండల ప్రత్యేకాధికారిగా వికారాబాద్ జిల్లా అటవీ శాఖాధికారి జ్ఞానేశ్వర్‌ను సోమవారం నియమించారు. ఇప్పటికే గ్రామ పంచాయతీలు స్పెషల్ ఆఫీసర్ల పాలనలో నడుస్తున్నాయి. ఈ నేపథ్యంలో జిల్లా అటవీశాఖ అధికారి జ్ఞానేశ్వర్ బాధ్యతలు స్వీకరించారు.

◆ **ఆర్యవైశ్యులు అన్ని రంగాల్లో రాణించాలి**

అనంతగిరి: ఆర్యవైశ్యులు అన్ని రంగాల్లో రాణించాలని, ప్రభుత్వం అండగా ఉంటుందని స్పీకర్ ప్రసాద్‌కుమార్ అన్నారు. ఆదివారం రాత్రి వికారాబాద్‌లోని ఆర్యవైశ్య భవన్‌లో నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవం జరిగింది. స్పీకర్ ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. ప్రభుత్వం ఆర్యవైశ్యులకు సముచిత స్థానం అందిస్తుందన్నారు. అనంతరం నూతన కమిటీని అభినందించారు. కార్యక్రమంలో వికారాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ చిగుళ్లపల్లి మంజుల రమేష్‌కుమార్, సంఘ రాష్ట్ర నాయకులు బాలేశ్వర్‌గుప్తా, జిల్లా అధ్యక్షుడు శివకుమార్, కౌన్సిలర్ గాయత్రిలక్ష్మణ్ పాల్గొన్నారు.

◆ **ముదిరాజ్ సంఘం సభ్యత్వం పెంచాలి**

యాలాల: మండల ముదిరాజ్ సంఘం సభ్యుల సభ్యత్వ నమోదును పెంచాలని గౌరవ అధ్యక్షుడు నర్సింహులు, సంఘం అధ్యక్షుడు అశోక్ అన్నారు. మండల కేంద్రంలోని ముదిరాజ్ సంఘ భవనంలో సమావేశం ఏర్పాటు చేశారు. మండలంలో ముదిరాజ్ సభ్యుల సభ్యత్వ నమోదును చేపట్టాలన్నారు. సభ్యుల సంఖ్యకనుగుణంగా సంఘం ఆధ్వర్యంలో వివిధ రకాల కార్యక్రమాలు, సమావేశాలు నిర్వహించడానికి వీలుంటుందన్నారు. కార్యక్రమంలో సంఘ ఉపాధ్యక్షుడు రాము లు, సభ్యులు భీమప్ప, గౌరారం రాములు, నాగప్ప ఉన్నారు.